రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

# మగువను ఎరవేసి..

## పదివేల కోసం పక్కా స్కెచ్-షాద్ నగర్ శివారులో దారుణ హత్య

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త:** జేబులో ఉన్న పదివేల రూపాయల కోసం ఓ కిరాతకుడు మగువను ఎరగా వేసి, ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న ఉదంతం షాద్‌నగర్ శివారులో సంచలనం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్ నగర్‌కు చెందిన కేశవులు ఈనెల 9న తన యజమాని దగ్గర తీసుకున్న నగదులో, ఖర్చులు పోను మిగిలిన పదివేల రూపాయలతో రాత్రి 9:30 గంటలకు షాద్ నగర్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇంటికి వస్తున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పిన కేశవులు, సమీపంలోని లక్కీ వైన్స్ వద్ద మద్యం సేవిస్తుండగా మృత్యువు పుల్లం గోవిల బజరన్న రూపంలో పరిచయమైంది.

**కాసుల కోసం కక్కుర్తి..**

కేశవులు వద్ద ఉన్న డబ్బును గమనించిన బజరన్న, ఆ సొమ్మును కొట్టేయాలని పక్కా పథకం రచించాడు. అదే సమయంలో మద్యం కోసం అక్కడికి వచ్చిన బైల్ల యాదమ్మ అనే మహిళపై కేశవులు మనసుపడటాన్ని గమనించిన నిందితుడు, ఆమెను ఎరగా వాడి ఉచ్చులోకి దించాడు. వెయ్యి రూపాయలకు బేరం కుదిర్చి వారిద్దరినీ వీర్లపల్లి రోడ్డులోని ఒక వెంచర్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ యాదమ్మకు మరో వెయ్యి రూపాయల అదనపు ఆశ చూపి, ఇద్దరూ కలిసి బండరాయితో మోది కేశవులను అత్యంత క్రూరంగా హతమార్చారు. అనంతరం అతని వద్ద ఉన్న నగదుతో పరారయ్యారు.

**రక్తపు మరకలే పట్టించాయి..**

మరుసటి రోజు వెలుగుచూసిన ఈ హత్యోదంతాన్ని ఏసీపీ లక్ష్మీ ... శ్రీనారాయణ, సీఐ సీతారాం బృందం అత్యంత వేగంగా దర్యాప్తు చేసింది. నిందితుడు ఘటనా స్థలంలో వదిలేసిన రక్తపు మరకల షర్టు పోలీసులకు కీలక ఆధారంగా మారింది. దీని ద్వారా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి నుంచి రూ. 3,900 స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని షాద్ నగర్ డీసీపీ శిరీష రివార్డులతో అభినందించారు.

# నగరంలో కొత్త ఫ్లైవర్

### -అల్విన్ కాలనీ టూ మియాపూర్
### -రూ.530కోట్లు మంజూరు చేసిన సర్కార్

**హైదరాబాద్, మే 12,ప్రభాతవార్త:**

హైదరాబాద్ నగరంలోని ఆల్విన్ కాలనీ నుంచి మియాపూర్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.530 కోట్లతో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు జారీ చేసిం ది. 1.8 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు తో ఆరు లేన్లుగా ఈ వంతెన నిర్మాణం జరగనుం ది. అంజయ్య నగర్ మీదుగా సాగే ఈ ఫ్లైఓవర్ ద్వారా కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్ వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ గణనీయంగా తగ్గ నుంది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.530 కోట్ల ను కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా పరిపాలనా పరమైన అనుమతులను మంజూరు చేసింది.




# గర్భసంచిలో ప్యాడ్ వదిలేసి ఆపరేషన్

గర్భసంచిలో నుంచి మూడు నెలల తర్వాత తీసిన ప్యాడ్

## సర్కారు దవాఖానాలో ఘోరం

**వైద్యం అంటే ప్రాణాలు పోయడం.. కానీ షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం అది ప్రాణాలు తీసే పనిగా మారింది. కాన్పు కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అక్కడి సిబ్బంది వ్యవహరించిన తీరు మానవత్వాన్ని మంటగలిపేలా ఉంది. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సంతోషంలో ఉన్న ఆ తల్లి గర్భసంచిలో, ఏకంగా సర్జికల్ ప్యాడ్ మరిచిపోయి కుట్టు వేసిన దారుణ సంఘటన వెలుగుచూసింది. దీంతో మూడు నెలల పాటు ఆ బాధితురాలు రక్తస్రావంతో, భరించలేని కడుపునొప్పితో నరకయాతన అనుభవించింది. చివరకు ఆ ప్యాడ్ లోపలే కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న స్థితిలో బయటపడటం సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఇన్ఫెక్షన్ సోకి ప్రాణాలు పోయే స్థితికి చేరుకున్నాక గానీ ఈ ఘోరం బయటపడలేదు. పేదల ప్రాణాలంటే లెక్కలేనితనం ప్రదర్శించిన ఆసుపత్రి సిబ్బందిపై ఇప్పుడు సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.**

**బాలింత ప్రాణాలతో సిబ్బంది చెలగాటం**
**మూడు నెలల పాటు రక్తస్రావంతో బాధితురాలు అవస్థ**
**ప్యాడ్ లోపలే కుళ్లిపోయి దుర్వాసన**

(షాద్‌నగర్, ప్రభాతవార్త)

షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిండు నిరక్ష ... ్యం ఒక మహిళ ప్రాణాల మీదకు తెచ్చింది. కాన్పు కోసం వచ్చిన మహిళకు వైద్యం చేసిన సిబ్బంది, గర్భసంచిలోనే ప్యాడ్ మరిచిపోయిన ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తిస్తోంది. బాధితుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న భవ్య (27) అనే మహిళ ఫిబ్రవరి 7న ప్రసవం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది.

ఆసుపత్రిలో భవ్య పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారని భావించి ఇంటికి వెళ్లిన భవ్యకు ఆ క్షణం నుండి కడుపునొప్పి మొదలైంది. రోజులు గడుస్తున్న కొద్దీ నొప్పితో పాటు రక్తస్రావం (బ్లీడింగ్) కూడా మొదలైంది. దీనిపై మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించగా, వారు కేవలం మందులు రాసి ఇచ్చారు. ఆ మందులు వాడినా నొప్పి తగ్గక పోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులలో కూడా చూపించారు. ఎంతోమంది వైద్యులకు చూపించి స్కానింగ్ చేయించినా అసలు విషయం బయటపడలేదు. ఇలా సుమారు మూడు నెలల పాటు ఆమె తీవ్రమైన నరకయాతన అనుభవించింది.

**వైద్యుల ఘోర తప్పిదం బయటపడిందిలా..**

మే 9వ తేదీన తమకు పరిచయమున్న ఒక మహిళా డాక్టర్‌ను బాధితులు సంప్రదించారు. సదరు డాక్టర్ భవ్యను క్షుణ్ణంగా పరిశీలించగా, గర్భసంచిలో కాన్పు సమయంలో వదిలేసిన ప్యాడ్ బయటపడింది. ప్యాడ్ లోపలే ఉండిపోవడంతో పూర్తిగా పాడైపోయి, దుర్వాసనతో బయటకు రావడంతో కుటుంబ సభ్యులు మరియు డాక్టర్ దిగ్భ్రాంతికి గురయ్యారు. మరికొన్ని రోజులు ఆలస్యమైతే కడుపులో ఇన్ఫెక్షన్ సోకి ప్రాణాపాయం సంభవించేదని బాధితులు వాపోయారు.

**సిబ్బందిపై చర్యలకు డిమాండ్**

ఇంతటి దారుణానికి కారణమైన ఆసుపత్రి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని భవ్య బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఆసుపత్రి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని, వారిని లిఖితపూర్వక ఫిర్యాదు ఇవ్వమని కోరినట్లు అధికారి తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటానని ఆయన వివరణ ఇచ్చారు

**చర్యలు తీసుకుంటాం : ఆసుపత్రి ఈవో**

భవ్య అనే మహిళ కాన్పు విషయంలో గర్భసంచిలో వస్త్రం (ప్యాడ్) మర్చిపోయినట్లు తన దృష్టికి తీసుకువచ్చారని, లిఖితపూర్వక ఫిర్యాదు వారి ద్వారా కోరానని ఆసుపత్రి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్ వివరణ ఇచ్చారు. ఈ విషయాన్ని విచరించి తగు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

### నరకయాతన అనుభవించా..



బాధితురాలు భవ్య

మూడు నెలల పాటు ఎంతో నరకయాతను అనుభవించానని బాధితురాలు భవ్య మీడియా ముందు వాపోయింది. కానుపు జరిగిన మరుసటి రోజు నుండి కడుపునొప్పి బ్లీడింగ్ నిరంతరంగా వస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో మళ్లీ సంప్రదిస్తే మందులు రాసి ఇచ్చారని, ఆ మందులు వేసుకున్నప్పటికీ తగ్గలేదని తెలిపింది. ఇంత దారుణంగా వ్యవహరించిన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.




తాళంతో ఉన్న కెసరి జ్యువెలరీ

మూసివున్న అజయ్ జ్యువెలరీ

# నమ్మించి..నట్టేట ముంచి

## రూ. 3 కోట్ల తాకట్టు బంగారంతో జంప్ - కుల్కచర్లలో జ్యువెలరీ వ్యాపారి మాయాజాలం

**కుల్కచర్ల, మే 12, ప్రభాతవార్త:** కుల్కచర్ల మండల కేంద్రంలో గత 15 ఏళ్లుగా నమ్మకంగా వ్యాపారం చేసుకుంటున్న మార్వాడీలు, ప్రజలను నట్టేట ముంచి పరారవుతున్న సంఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా కర్ణాటక పోలీసులు కుల్కచర్ల లోని కెసరి జ్యువెలరీ షాపులో తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

**దొంగతనం చేస్తూ దొరికిపోయి..**

కుల్కచర్లలో కేసరి జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్న వికాస్, కైలాస్ అనే మార్వాడీలు కర్ణాటకలోని ఒక షాపులో బంగారం, వెండి దొంగతనం చేసి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ క్రమంలో వారు పోలీసులకు చిక్కడంతో అసలు విషయం బయటపడింది. వీరు అంతకుముందు కూడా దొంగతనంగా తెచ్చిన బంగారాన్ని షాపులో దాచారన్న సమాచారంతో కర్ణాటక పోలీసులు మంగళవారం వారి ఇళ్లు, షాపుల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొంత మేర బంగారం, వెండి లభించినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ షాపులో స్థానిక ప్రజలు తమ నగలను తాకట్టు పెట్టడమే కాకుండా, పెళ్లిళ్ల కోసం కొత్త నగలు చేయించాలని ఆర్డర్లు ఇచ్చి నగదు కూడా చెల్లించారు. యజమానుల అరెస్టుతో ఇప్పుడు తమ సొమ్ము ఏమవుతుందోనని బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మరోవైపు, అజయ్ జ్యువెలరీ షాపు యజమాని చేసిన మోసం బాధితులను కోలుకోనీయకుండా చేస్తోంది. పేద ప్రజలు తమ అత్యవసర అవసరాల కోసం, ముఖ్యంగా పెళ్లిళ్ల కోసం తాకట్టు పెట్టిన సుమారు రూ. 3 కోట్ల విలువైన బంగారంతో అజయ్ పరారయ్యాడు. గత నవంబర్ నెల నుండి ఇతని ఆచూకీ లేకపోవడంతో బాధి తులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నప్పటికీ, బంగారం రికవరీ కావడం కష్టంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తనిఖీలు చేపడుతున్న కర్ణాటక పోలీసులు

ఈ ఘటనలపై కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్ స్పందిస్తూ.. గ్రామీణ ప్రజలు ప్రైవేట్ మార్వాడీలను నమ్మి మోసపోవద్దని, ఆభరణాలను ఎల్లప్పుడూ బ్యాంకుల్లోనే తాకట్టు పెట్టుకోవాలని సూచించారు.

బంగారం కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా హాల్‌మార్క్ ముద్రను గమనించాలని, నాణ్యత విషయంలో అనుమానం ఉంటే నిపుణుల సలహా తీసుకోవాలని ఆయన కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

# మాదకద్రవ్యాలపై అక్షర పోరాటం

## ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి కృషిని అభినందించిన డిజిపి

**షాద్‌నగర్, మే 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) జాడ లేకుండా చేసేందుకు ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో సమాజంలో అవగాహన కల్పించేందుకు విద్యావేత్తలు చేస్తున్న కృషికి పూర్తి మద్దతు లభిస్తోంది. తెలంగాణను డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష ... ్యంతెలంగాణ ప్రాంతంలో మారకద్రవ్యాల నీడ కూడా తాకకుండా చర్యలను మరింత కఠినతరం చేస్తున్నామని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సీరియస్‌గా ఉన్నారని, కేవలం రాజధానిలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ఈ సమస్య ఉన్నా తక్షణమే స్పందిస్తామని ఆయన వెల్లడించారు. ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి పరిశోధనషాద్‌నగర్ పట్టణానికి చెందిన, శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి మాదకద్రవ్యాల దుర్వినియోగంపై లోతైన పరిశోధన చేస్తున్నారు. ఈ సామాజిక రుగ్మతను అరికట్టడానికి "అక్షర పోరాటం" చేయడమే లక్ష ... ్యంగా ఆయన ఒక పరిశోధనాత్మక పుస్తకాన్ని రూపొందిస్తున్నారు. డీజీపీ అభినందనలు పుస్తకానికి ముందుమాటఈ నేపథ్యంలో ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసి తన పరిశోధన వివరాలను తెలియజేశారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందిస్తూ, ప్రొఫెసర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా, రవీందర్ రెడ్డి రాస్తున్న ఈ పుస్తకానికి తాను ముందుమాట రాస్తానని డీజీపీ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో ముందడుగుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ అంశంపై అయితే పోరాటం చేస్తున్నారో, అదే అంశం మీద పరిశోధన చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ పుస్తకాన్ని పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వానికి సమర్పిస్తానని ఆయన వెల్లడించారు. గతంలో ఆయన సివిల్ సర్వీస్ అభ్యర్థుల కోసం రాసిన "ఇండియన్ ఎకానమీ" పుస్తకాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించడం తన జీవితంలో మరపురాని అనుభవమని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మాదకద్రవ్యాలపై పోరాటానికి సిద్ధమవుతున్న రవీందర్ రెడ్డిని పలువురు విద్యావేత్తలు కొనియాడారు.



రవీందర్ రెడ్డిని అభినందిస్తున్న డిజిజి సివి ఆనంద్



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## ధాన్యం కొనుగోలు ప్రారంభించకుంటే
# రోడ్లను స్తంభింపజేస్తాం

### రైతు దీక్షలో బిఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

**యాలాల మే12, ప్రభాతవార్త :** కల్లబొల్లి మాటలు, అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి,జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్, రాజు గౌడు, చెన్నారం మాజీ సర్పంచు శివకుమార్, యాలాల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వడ్డె రాములులు ఆరోపించారు. 24 గంటల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించకుంటే రాస్తారోకో నిర్వహించి రోడ్లన్ని స్తంభింప చేయడంతో పాటు ధాన్యాన్ని ఎమ్మెల్యే ఇంట్లో, క్యాంపు కార్యాలయంలో పారబోస్తామని వారు హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం యాలాల మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో నియోజకవర్గ స్థాయి రైతు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ వర్షాకాలం ముంచుకొస్తున్నప్పటికీ వరిధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సిగ్గుచేటన్నారు. ధాన్యం కొనుగోలులో ఎమ్మెల్యే కావాలనే ఆలస్యం చేస్తూ రైస్ మిల్లర్లకు పరోక్షంగా సహాకరిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లకు కొమ్ముకాస్తున్నారని విరుచుకుపడ్డారు. రైతు భీమా అమలు కొండెక్కిందని వారు విమర్శించారు. రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే మాత్రం తనకు పట్టనట్లు వ్యవ హరిస్తున్నారన్నారు. అంతకు ముందు బిఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబెట్టిన ధాన్యం కుప్పలను సందర్శించి పరిశీలించారు.

## సొంత ఆదాయ వనరులపై / స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

### రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**రంగారెడ్డి అర్బన్, మే 12 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు కేవలం ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లపైనే ఆధారపడకుండా, సొంత ఆదాయ వనరులను పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన దక్షి ... ణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న పన్నులు, ప్రకటనల రుసుములు, వృత్తి పన్ను వంటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

అనవసర వ్యయాలను తగ్గించుకొని, ఆ నిధులను ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు మళ్లించాలన్నారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిశిత పర్యవేక్షణ చేపట్టాలన్నారు.

ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని నివే దిక రూపంలో ప్రభుత్వానికి అందించడమే ఫైనాన్స్ కమిషన్ ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఈ సదస్సులో ఆర్థిక సం ఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్. సుధీర్ రెడ్డిలతో పాటు వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈ ఓలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, సర్పంచులు పాల్గొన్నారు. పారిశుధ్యం, పచ్చదనం, పన్ను వసూళ్లపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.




మాట్లాడుతున్న ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

# ఆడుకుంటున్న బాలుడిపై కుక్కల దాడి

**వనస్థలిపురం, మే12, ప్రభాతవార్త**

ఇంటి ముందు బాలుడిపై వీధి కుక్కలు ఒక్కసారి గా దాడి చేశాయి. ఈ దాడి లో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి ఐసియు వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం బోటి మీది పల్లి గ్రామానికి చెందిన సుమ న్ శివానిల కుమారుడు అద్విక్( 8) వ్యవసాయ కుటుంబం. శివాని ఆ గ్రామ సర్పంచ్. వేసవి సెలవుల్లో భాగంగా టీచర్స్ కాలనీ ఫేస్ టు లో ఉం టున్న పెద్దమ్మ కవిత వద్దకు వారం రోజుల క్రితం వచ్చాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయం లో ఇంటి బయట పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. టీచర్స్ కాలనీ రోడ్ నెంబర్ సెవెన్ లో సుమారు ఐదారు కుక్కలు అద్విక్ వెంటపడడంతో. పక్కన ఉన్న సెల్లార్ లోకి పరిగెత్తగా అతన్నిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తీవ్ర గాయాల పాలైన అతన్ని బంధువులు కామినేని ఆస్పత్రికి తరలించారు.. వైద్యులు పరిశీలించి ఐసియూ వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు.

విషయం తెలుసుకున్న బిజెపి ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్చార్జి. సామ రంగారెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జిహెచ్ఎంసి బిజెపి మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, లింగోజి గూడ.మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి లు కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

**నందిగామ, మే 12, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న మహిమాన్విత శ్రీ రేణుక ఎల్లమ్మ మాత కల్యాణ మహోత్సవాన్ని నందిగామ గ్రామానికి చెందిన సార రవికుమార్ మమత దంపతులు మంగళవారం కనుల పండువగా జరిపించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సర్పంచ్ కొమ్ము కృష్ణ రయ్యారు. అమ్మవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్ నాయకులు ఎదిరే శ్రీకాంత్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్, అగ్గి మమత సూరి, చించేటి లత శివ కుమార్, నాయకులు చించేటి కృష్ణగౌడ్, బి జంగయ్య గౌడ్, మహేష్, ఉప్పరి రాజేష్, తడకల జంగయ్య నందిగామ, అంతిరెడ్డి గూడ గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

## జనగణన సమాచారం సక్రమంగా ఇవ్వండి



అధికారులకు తమ కుటుంబ వివరాలను అందజేస్తున్న సర్పంచ్ స్వామి నవనీత

**షాబాద్, మే 12, ప్రభాతవార్త :** దేశ పురోగతికి జనాభా లెక్కలు ఎంతో అవసరమని చందనవెల్లి గ్రామ సర్పంచ్ చేవెళ్ల స్వామి నవనీత అన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో మంగళవారం జనగణనలో భాగంగా చేపట్టనున్న గృహాల జాబితా తయారీ, గృహ జనగణన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జూన్ 9 వరకూ కొనసాగుతుందని తెలిపారు. గ్రామస్థులు ఎన్యూమరేషన్ అధికారులకు అవసరమైన సమాచారం సక్రమంగా అందించాలని కోరారు. ప్రతి కుటుంబ సభ్యుల వివరాలు, నివాస సమాచారం, వసతుల వివరాలు సరిగ్గా నమోదు చేస్తే ప్రభుత్వానికి గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడం సులభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లోవోల్టేజ్ సమస్యకు విముక్తి



ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభిస్తున్న సర్పంచ్

**శంకర్‌పల్లి, మే 12, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని 10వ వార్డులో నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా, కవేలి తిరుపతి రెడ్డి ప్రారంభించారు. దీర్ఘకాలంగా లోవోల్టేజ్ సమస్యతో స్థానికులు బాధపడుతున్న విషయాన్ని వార్డు సభ్యులు కవేలి తిరుపతి రెడ్డి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించటానికి అన్ని విధాల తన వంతు సహకారం అందిస్తానని తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ వెంకటేష్, నాని ప్రభాకర్, మందుముల నర్సిములు, నక్క జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## భగీరథ నుంచి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలి

**శంకర్‌పల్లి, మే 12, ప్రభాతవార్త :** పోక్సో కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై లైంగిక వేధింపుల కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయటంలేదని సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటిజన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాధిత కుటుంబం న్యాయం కోసం తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. బాధితురాలి కుటుంబాన్ని బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ



లక్ష్మీనర్సింహా స్వామి, రేణుక ఎల్లమ్మజమదగ్ని కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ధర్మన్న గారి [illegible] పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

**ఘట్‌కేసర్ రూరల్, మే 12, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ ఇస్మాయిల్ ఖాన్‌గూడలో శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి, శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా కన్నుల పండుగగా జరిగాయి. ఇస్మాయిల్ ఖాన్‌గూడలోని శ్రీ రేణుక ఎల్లమ్మదేవి, శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయాల 37వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా లక్ష్మీనర్సింహా స్వామితో పాటు శ్రీ రేణుక ఎల్లమ్మదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లలితా కృష్ణా ముదిరాజ్, ఆలయ ధర్మకర్త ఈగ నందినిరాము ముదిరాజ్, ఈగ లాస్య మధు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

## యాదవుల సంక్షేమానికి కృషి చేయాలి



యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్‌ను అభినందిస్తున్న నేతలు

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యాదవ సహకార కార్పొరేషన్ లిమిటేడ్ చైర్మేన్‌గా రఘునాథ్ యాదవ్ ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను సత్కరించారు. అందరి సహకారంతో యాదవ కార్పొరేషన్‌ను విజయవంతంగా ముందుకు నడిపించగల గొప్ప నాయకుడు అందరినీ కలుపుకొనిపోగాల శక్తి ఉన్న గొప్ప యువ నాయకులు రఘునాథ్ యాదవ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంజన్ యాదవ్ రంగారెడ్డి జిల్లా ఉపద్యక్షులు. చెన్నకేశవులు యాదవ్ కపిల్ యాదవ్ శివ యాదవ్ రఘు యాదవ్ ఆనంద్ కుమార్ యాదవ్ సాయి యాదవ్ నర్సింగ్ యాదవ్ తదితర యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పేపర్ లీకేజిలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పెద్దేముల్, మే 12, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిషత్తుతో ముడిపడి ఉన్న నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు, అవకతవకలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఏబివిపి రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో కన్వీనర్ మౌనేశ్వర్‌చారీ అన్నారు. పరిక్షల నిర్వహణలో నిర్లక్ష్యం, భద్రత లోపాలు, అవినీతి కారణంగా లక్షలాది మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. కోట్లాది రూపాయిల లావాదేవిలతో విద్యార్థుల భవిషత్తును వ్యాపారంగా మార్చడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. పేపర్ లీకేజిలకు పాల్పడిన వ్యక్తులు, మద్యవర్తులు మాత్రమే కాకుండా తమ భాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైన ఎన్‌టిఏ అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఏబివిపి పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## అనుమానస్పదంగా యాచకుడి మృతి

**వికారాబాద్, ప్రభాతవార్త :** అనుమానస్పద స్థితిలో ఓ యాచకుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం దగ్గరలో ఓ యాచకుడు మృతి చెందాడని సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు జేబులో ఆధార్ కార్డు లభించడంతో, మృతుడు పేరు చాకలి బందెయ్య(40), గ్రామం లక్నాపూర్, జిల్లా రంగారెడ్డి అని వివరాలు తెలిసాయని పోలీసులు తెలిపారు. అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుకుమార్ తెలిపారు.

# సర్పంచ్ గారూ ఈ కంపు ఎంతకాలం?



అంతిరెడ్డి గూడ పంచాయతీలో డ్రెయినేజీ దుస్థితి

★ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ అధ్వాన్నం ★ రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు ★ రిపేర్లు చేయాలని స్థానికుల డిమాండ్

**నందిగామ, మే 12, ప్రభాతవార్త:** అంతిరెడ్డిగూడ గ్రామపంచాయతీ సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. స్థానిక పృథ్వి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మరమ్మతులు చేయకపోవడంతో మురుగు ప్రవాహం తరచు స్తంభించిపోతోంది. తరచు కాలువలు పొంగుతుండటంతో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. దీనివలన పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గరవుతున్నారు. దుర్వాసన భరించలేక పోతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల పరిశ్రమల నుంచి వచ్చే వాయు కాలుష్యంతో సతమతమవుతున్నామని వివరించారు. ఇప్పటికైనా సర్పంచ్ స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## వ్యవసాయ భూములను సారవంతంగా మార్చుకోండి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త డా. ఆర్.డి. ప్రసాద్, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, మండల వ్యవసాయ అధికారి విజయ చంద్ర తదితరులు

**షాబాద్, మే 12, ప్రభాతవార్త :** రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకుని పోషక లోపాలు సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఆర్.డి ప్రసాద్ కోరారు. మెరా గామ్ మేర గౌరవ్ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా నూనె గింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ గ్రామంలో నిర్వహించిచిన అవగాహన సమావేశం లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూములను సారవం తంగా మార్చుకోవాలని సూచించారు.

పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియ దున్నాలని పేర్కొన్నారు. జీవన ఎరువుల వినియోగం, పంట మార్పిడి, చెరువు మట్టి ద్వారా నేల సారవంతం చేసుకోవచ్చని చెప్పారు. దీని వలన పంట ఆరోగ్యంగా పెరగడంతోపాటు.. ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉందని తెలిపారు. పైర్లకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులపైనా అవగాహన కల్పించారు. తెగుళ్లు, చీడపీడల నివారణకు చేపట్టల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పంటల సాగు విధానంలో మెళకువలు పాటించటం ద్వారా అధికదిగుబడి పొందాలని సూచించారు.

మండల వ్యవసాయ అధికారి విజయ చంద్ర మాట్లాడుతూ పట్టా కలిగిన ప్రతి రైతు ఫార్మ ర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ప్రకారం ఎరువులు వాడాలని, సబ్సిడీలో జీలుగ, జనుము విత్తనాలు ఈ నెల చివరకు అందుబాటులోకి వస్తావని తెలిపారు. సర్పంచ్ సబితా గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, ఉప సర్పంచ్ మందుగుల మాణిక్యం, రంగం శ్రీనివాస్, బలవంత రెడ్డి, వెంకటయ్య, అంజయ్య, నర్సింహులు, అనంతయ్య, లక్ష్మి ్మ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు వ్యూహం

- వర్షాకాలంలో సమస్యలపై అధ్యయనం
- వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ వైర్లు సరిచేయాలి
- బలహీనంగా ఉన్న చోట్ల నూతన స్తంభాలు
- ప్రజాబాటలో విద్యుత్ శాఖ ఏఈ



గ్రామంలో పర్యటిస్తున్న ఏఈ

**మొయినాబాద్, మే 12, ప్రభాతవార్త :** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రజా బాట కార్యక్రమం ద్వారా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామంలో 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్‌తో కలిసి మొయినాబాద్ విద్యుత్ శాఖ ఏఈ బనోతు హాము గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి అదనంగా 15 విద్యుత్ స్తంభాలు అవసరమని, రైతుల పొలాల వద్ద ఉన్న విద్యుత్ వైర్లు నాణ్యత కోల్పోవడంతో ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం రానున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సమస్యలు వచ్చిన తర్వాత స్పందించే బదులు ముందుగానే నివారణ చర్యలు తీసుకుంటే గ్రామంలో గాని, రైతులకు గాని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలను గుర్తించిన ఏఈ బనోతు హాము వెంటనే సంబంధిత పై అధికారి డి. రమేష్ చంద్రకు వివరించారు.

దీనిపై స్పందించిన ఆయన త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేసి గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల రామచంద్రయ్య వెలగని అశోక్ గౌడ్ సోమ వెంకటేష్ ఎలగని సాయి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై స్వచ్ఛందంగా యుద్ధం



సొంత ఖర్చుతో చెత్త కుప్పలపై బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న యువకులు

**నందిగామ, మే 12, ప్రభాతవార్త :** ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఎదురు చూడకుండా చేయి చేయి కలిపారు. పరిసరాల పరిశుభ్రత కోసం.. పారిశుధ్య నివారణ కోసం నడుం బిగించారు. వివరాల్లోకి వెళ్తే..నందిగామ మండలం సిడి త్నాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తాటిగడ్డ తండాలో మురుగునీరు ప్రవహించే కాలువను శుభ్రం చేస్తూ సిడితండా గ్రామపంచాయతీ ఒకటవ వార్డు సభ్యుడు రాజేష్, రెండవ వార్డు సభ్యురాలు జటావత్ మాధవి భర్త లక్ష ్మణ్ నాయక్‌లు గ్రామ పంచాయతీ సహకారంతో సిబ్బందితో కలిసి పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టారు. తండా నుండి వచ్చే మురుగునీరు ప్రవహిస్తున్న కాలువపై, పారిశుధ్యం లోపించిన ప్రదేశంపై సున్నం రసాయన మందులతో కలిపి ఉన్న పౌడర్ చల్లారు. తండా ప్రజల ఆరోగ్యం కోసం.. సేవకులుగా మారి పలువురికి ఆదర్శంగా నిలిచిన వార్డు సభ్యులు రాజేష్, మాధవి భర్త జటావత్ లక్ష ్మణ్ నాయకులను తండా వాసులు అభినందించారు.



జనగణనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్

### జనగణనతో మరిన్ని...

## మెరుగైన సంక్షేమ పథకాలు

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో జనగణన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. గాంధీ నగర్‌లో తన కుటుంబ వివరాలను నమోదు చేయించుకున్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమ పథకాల అమలులో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబం సరైన వివరాలను అందించి అధికారులకు సహకరించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రజల వివరాలను సేకరించే విధానం, నమోదు ప్రక్రియపై అధికారులకు సూచనలు అందించారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన జనాభా వివరాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని ప్రథమ పౌరుడు తెలిపారు. ప్రజలు జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బచ్చలి నరేష్ సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త :** మనసు నిండుగా.. ఆరోగ్యానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిరుపేద అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి ఇబ్బంది పడే నిరుపేదల కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధిని పెద్ద ఎత్తున అందజేస్తుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా 83 చెక్కులు ఈ సందర్భంగా ఆయన అందజేశారు. ఫరూక్ నగర్ మండల లబ్ధిదారులకు 24, కొత్తూరు మండలానికి 14, కొందరుకు మండలానికి 10, కేశంపేట మండలానికి 14, నందిగామ మండలానికి నాలుగు, జిల్లేడు కూడా మండలానికి నాలుగు చెక్కులతో పాటు, షాద్నగర్ మున్సిపాలిటీ కి సంబంధించి 13 చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భగీరథను అరెస్ట్ చేయకపోతే ఆందోళన బాట

### ఎస్ఎఫ్ఐ, సిపిఎం నేతల డిమాండ్

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త :** బండి భగీరథ పై పోక్సో కేసు నమోదైన ప్రభుత్వ ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేక పోతుందని, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ..అమ్మాయిలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు.

మైనర్ బాలికకు జరిగిన అన్యాయాన్ని చట్టపరంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పైన కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. బాధ్యతగల పదవిలో ఉన్న బండి సంజయ్ కొడుకు మైనర్ బాలికపై మద్యం తాగించి అత్యాచారం చేయడం చాలా దారుణం అని విమర్శించారు. ప్రియాంక రెడ్డికి జరిగిన న్యాయం మైనర్ బాలిక విషయంలో ఎందుకు జరగడం లేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తాం అని తెలియజేస్తున్నాం.

**కేసును పక్కదారి పట్టించకండి**

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని సిపిఎం షాద్‌నగర్ పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ డిమాండ్ చేశారు.

ఆయన మీడియాతో మాట్లాడుతూ నేరం చేసిన తమ కుమారుడు బండి భగీరథను పోలీసులకు అప్పగించి పదవికి రాజీ నామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు ఈ కేసును పక్కదారి పట్టకుండా నాయబద్ధంగా వ్యవ హరించి నింది తునికి వెంటనే పట్టుకొని శిక్ష పడే విధంగా వ్యవహరించాలని ఆయన పోలీసులను కోరారు . నిందితుడు ఎం తటి పెద్దవాడైనా సరే విచారణ వేగవంతంగా చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు గిరిప్రదక్షణలో పాల్గొన్న ఆదిత్య పరాశ్రీ స్వామి

### వేద సంపదను

## పరిరక్షించుకోవాలి

**జిల్లెడు చౌదరిగూడ, మే 12, ప్రభాతవార్త:** సమ సమా జంలో వేదాలను రక్షించు కోవాల్సి న భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు ఆదిత్య పరా శ్రీ స్వామిజీ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరి గూడ మండలంలోని శ్రీ వేద గిరి హనుమాన్ దేవాలయం వద్ద నిర్వహించిన గిర ప్రదక్షిణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మనుగడకు నాటి పూరాణాలు ఎంతో దోహ దపడతాయని పేర్కొన్నారు. అవి నేటి సమాజానికి ఎంతో అవసరమని, పాశ్చాత్య సంస్కృతి మోజులో యువతలో దైవ చింతన సన్నగిల్లు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వ లాభం కోసం దేవాలయాలను అడ్డు పెట్టుకుంటున్నాయని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగ ఆలయాల అభి వృద్ధి పరుచుకోవాలని సూచించారు.

గ్రామాలలో ఆధ్యా త్మిక కార్యక్రమాల ద్వారా శాంతి నెలకొంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో అంబె బాబయ్య, శ్రీవర్ధ న్‌రెడ్డి, సర్పంచ్‌లు రాంచంద్రయ్య, చంద్ర శేఖర్, నర్సింహులు, నీలయ్య, చలివేంద్రంపల్లి రాజు, కృష్ణారెడ్డి, వెంకట నర్సింహురెడ్డి, బాల్‌రాజు, వెంకటేష్, గోపాల్, కృష్ణ, కుర్మయ్య, సత్య నారాయణరెడ్డి, ఆంజనేయులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎదిర రాజు, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, బాబు రావు, రవి, హరినాయక్, ఎదిర రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

## రూ.4.49 లక్షల సహాయ నిధి మంజూరు

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 13మంది లబ్ధిదారులుకు 4,49,000, రూపాయలు గల సీఎం సహయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, కౌన్సిలర్ పెంటయ్య, మురళీ మోహన్ (అప్పి)బచ్చలి నరేష్, చందు లాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రశాంత్

## బిసి జనసేన రాష్ట్ర అధ్యక్షునిగా ప్రశాంత్

**షాద్‌నగర్, మే 12, ప్రభాతవార్త :** బిసి జనసేన రాష్ట్ర అధ్యక్షునిగా పసుపుల ప్రశాంత్ నియామకమయ్యారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణలో బిసిలందరిని ఏకం చేసి పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కుల జలజ, కాటం భాగ్యలక్ష్మి ్మ గౌడ్, గడ్డమీద రమేష్, పసుపుల సత్యం, రాములు, వెంకటయ్య, సాయి తరుణ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లు కావాలంటూ వృద్ధురాలి నిరసన

**జవహర్‌నగర్, మే 12.ప్రభాతవార్త :** జవహర్ నగర్ బాలాజీ నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన బూదల దానమ్మ అనే వృద్ధురాలు, తాను 40 ఏళ్లుగా నివసిస్తున్న ఇంటిని స్థానిక రాజకీయ నాయకులు అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ కాప్రా ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. నా ఇల్లు నాకు కావాలి అంటూ మీడియా ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై బాధితురాలు మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నీ కలిసి ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు మే 5న స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలికి న్యాయం చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, అధికారులు వెంటనే స్పందించి దానమ్మకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు సహించం

**జవహర్‌నగర్, మే 12, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. మంగళవారం జవహర్ నగర్ పరిధిలోని పలు సర్వే నంబర్లలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు జేసీబీలతో కూల్చివేశారు. అధికారుల సమాచారం మేరకు సర్వే నంబర్లు 207, 240, 384లో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి బేస్మెంట్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి నిర్మాణ దశలో ఉన్న అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు అనధికారిక వెంచర్లు, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.



ఫాతిమాపూర్ చర్చ్ వార్షికోత్సవంలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ,తదితరులు

## సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఫాతిమాపూర్ చర్చి వార్షికోత్సవం

**కొత్తూర్, మే 12, ప్రభాతవార్త:** కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్ చర్చ్‌లో మంగళవారం నిర్వహించిన 13వ వార్షికోత్సవ ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవతా విలువలను బోధిస్తాయని అన్నారు. ప్రజలు పరస్పర సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ఫాతిమాపూర్ చర్చ్ ఆధ్యాత్మిక సేవలతో పాటు సమాజ సేవలో కూడా విశేషపాత్ర పోషిస్తోందని కొనియాడారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యా త్మిక గీతాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చర్చ్ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో చర్చ్ ఫాదర్లు, క్రైస్తవ మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సన్నీకి సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన కె ఎల్ ఆర్

**కందుకూరు, మే 12, (ప్రభాతవార్త):** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థిక చేయుత అందిస్తుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం కందుకూరు మండలం జైత్వారం గ్రామానికి చెందిన పొట్టి చిన్నయ్య కుమారుడు సన్నీ ఇటీవల ప్రమాదాన్ని గురై ఆసుపత్రిపాలైనారని ఈ సమయంలో వారికి ఆర్థికఇబ్బంది కలిగిందని సూచించారు. సర్పంచ్ వైరు కొండల్‌రెడ్డి సురవతో సాయికి సంబంధించి వైద్య రిపోర్టును ప్రభుత్వానికి నివేదించడం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.28 వేలు సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజలు ఆనందంగా ఉంటేనే పాలకులు ఉత్సాహంగా పనిచేస్తారని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన వారందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైద్వారం సర్పంచ్ బైరు కొండల్ రెడ్డి, ఉప సర్పంచ్ నవీన్, వార్డ్ మెంబర్లు సత్యనారాయణ, మమత మహేందర్, నాయకులు శ్రీశైలం, పొట్టి చెన్నయ్య, తోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## వేసవి శిక్షణ శిబిరం విజయవంతం

**మహేశ్వరం,మే12,ప్రభాతవార్త:** మహేశ్వరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల నుంచి విశేష స్పందన పొందుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ శిబిరం నిరాటంకంగా కొనసా గుతూ విద్యార్థుల్లో సృజనా త్మకత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసానికి దోహద పడుతోంది. ఈ శిబిరంలో వివిధ రంగా లకు చెందిన ఇన్‌స్ట్రక్టర్లు విద్యార్థులకు పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. యోగ,అల్లికలు, కుట్లు,డాన్స్,పాటలు,చిత్రలేఖనం,కథలు చెప్పడం,రీడింగ్, క్రీడలు,వ్యక్తిత్వ వికాసం వంటి విభా గాల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారు.వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ శిక్షణను ఉత్సాహంగా స్వీకరిస్తున్నారు.మే 25వ తేదీ వరకు మొత్తం 15 రోజుల పాటు కొనసాగనున్న ఈ వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానో పాధ్యాయులు మాద్గుల శంకర్ తల్లిదండ్రులను కోరారు. పిల్లల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ శిబిరాన్ని మండల విద్యాధికారి డాక్టర్ వి.కసన నాయక్ సందర్శించి విద్యార్థులు, శిక్షకులు, ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని ఆయన తెలిపారు.



విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

## మృతుని కుటుంబ సభ్యులకు బియ్యం అందజేత

**తలకొండపల్లి మే 12 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని మాదాయ పల్లి గ్రామానికి చెందిన గుండె భాస్కర్ గౌడ్ ఇటీవల మృతి చెందాడు. మంగళవారం నాడు వెల్జాల్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు తిరుమణి రాఘవేందర్ గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్ గౌడ్ లేని లోటు కుటుంబానికి తీర్చలేని దని ఆయన అన్నారు. అనంతరం వ్యక్తిగతంగా మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్జాల్ గౌడ సంఘం అధ్యక్షులు తిరుమణి రాఘవేందర్ గౌడ్, నాయకులు అభిలాష్ గౌడ్ సాయికుమార్ ఆంజనేయులు శ్రీశైలం తదితరులు ఉన్నారు.



ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

**మానవసేవ యే మాధవసేవ అంటూ...**

## పెళ్లిరోజు సందర్భంగా రాగి అంబలి పంపిణీ

**తలకొండపల్లి మే12,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన వెల్జాల్ చలివేంద్రం దగ్గర మంగళవారం నాడు అయిల్ కల్పన వెంకటేష్ దంపతులు పెళ్లిరోజు సందర్భంగా ప్రయా ణికులకు గ్రామస్తులకు రాగిఅంబలి పంపిణీ చేశారు. వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చడానికి బాటసారులకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణిచేస్తున్నట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గౌడ్ కు ప్రతికి ధన్యవాదాలుతెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దహార్తిని తీర్చడానికి మంచి మనసు తో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు,మాజ్జిగా,అంబలితోవారి దాహార్తనీతీర్చుకుంటున్నారు.గ్రామంలో ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సాయి కుమార్ గౌడ్,విజయ్ యాదవ్,భాస్కర్,స్వామి,సాధక్ ఆలీ,రవి, రాఘవేంద్రర్, శ్రీశైలం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .




అంబలి అందజేస్తున్న దంపతులు

## మాజీ మంత్రి హరీష్ రావుపై కవిత అనుచిత వ్యాఖ్యలు తగదు

**తలకొండపల్లి మే 12, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి టి హరీష్ రావు పై కల్వకుంట్ల కవిత చేసిన అనుచిత వాక్యాలు తగవని తలకొండపల్లి మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఖండించారు. మంగళవారం నాడు తల కొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పల పల్లి గ్రామంలో బి ఆర్ఎస్ నాయకులు బోస్ వెంకటయ్య, విజయ్ కుమార్లు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు అవమానకర వాక్యాలు చేయడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని వారన్నారు. కల్వకుంట్ల కవిత హరీష్ రావు పై లేనిపోని ఆరోపణలు చేస్తూ విమర్శించడం తగదన్నారు. హరీష్ రావు నిరంతరం ప్రజల కోసం పాటుపడే నాయకుడని, ప్రజాస్వామ్యతంగా చర్చించవలసిన అంశాలపై గతంగా విమర్శలకు తీయడం సబబు కాదని వారు అన్నారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు బోసు వెంకటయ్య విజయ్ కుమార్ రెడ్డి రమేష్ లింగం గౌడ్ మహేష్ బాలునాయక్ లాల్ శత్రు బీమా తదితరులున్నారు.



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## చీపునుంతలలో అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం

**తలకొండపల్లి మే 12, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో మంగళవారం నాడు అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. చీపునుంతల గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆసన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డైరెక్టర్ సి నార డాక్టర్ రాములు ,లతీఫ్ పాష, డాక్టర్ శ్రీదేవిలు ముఖ్య అతిథిగా హాజరైనారు .ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2026 అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. మొక్కల ఆరోగ్యం జీవవైద్య పరిరక్షణ పంటల వైవిధ్యీకరణ నేల ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలపై రైతులకు వివరించారు. మొక్కలను కాపాడడం ద్వారా పర్యావరణ సమతుల్యత, కాకుండా చీడపీడలు తెగుళ్ల ఎదుర్కొనే సామర్థం పెరుగుతుందన్నారు. రైతులు ఏకపంట ఆగునుండి నూనె గింజలు చిరుధాన్యాల వైపు మళ్లీ రైతులు ఆదాయం పెంచుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన నేల ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన మొక్కల పెంపునకు ఉపయోగపడుతుందని, అతి పరీక్షలు సమతుల్య పోషక నిర్వహణ సేంద్రియ ఎరువులు బయోపార్టిలైజర్లు సమీకృత పోషక నిర్వహణ తదితర పద్ధతులు రైతులు పాటించాలని, దీని ద్వారా ఆరవంతమైన నీళ్లతో పాటు అధిక దిగుబడిలో వచ్చే అవకాశం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న, ఉప సర్పంచ్ రాజు ,చెన్నకేశవులు , అల్వాల్ రెడ్డి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

**కేశంపేట, మే 12, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో మంగళవారం అక్రమంగా మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు టిప్పర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం సంగెం గ్రామంలో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో అక్కడికి వెళ్లిన పోలీసులకు మూడు టిప్పర్లు అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించారు.టిప్పర్ నెంబర్ టిఎస్ 09యుజె 9000, డ్రైవర్ శ్యాం కుమార్ సాహూ.టిఎస్ 30టిఏ4087 డ్రైవర్ అమరేందర్ కుమార్. టిఎస్ 07యుజె 9843. డ్రైవర్ అజయ్ కుమార్ యాదవ్ వీరంతా బీహార్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించారు. టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో సంఘీ కూడా గ్రామానికి చెందిన వరికుప్పల చంద్రయ్య మరియు నరేష్ అనే వ్యక్తులు పోలీసుల విధులకు ఆటంకాలు కలిగిస్తూ టిప్పర్లను అక్కడి నుండి తరలించకుండా అడ్డుకోవడం జరిగింది అని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని అడ్డుకోవడం చట్టపరమైన చర్యలకు భంగం కలిగించడం తీవ్ర నేరమని పోలీస్ శాఖ హెచ్చరిస్తుందని అందుకుగాను పైన పేర్కొన్న అక్రమ మట్టి రవాణాకు పాల్పడిన వారిపై మరియు విధులకు ఆటంకం కలిగించిన వారందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు. అక్రమ మట్టి రవాణా ప్రభుత్వ భూములు మరియు ప్రకృతి వనరుల దోపిడీపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని ఇటువంటి అక్రమ వ్యాపారాలలో పాల్గొనేవారు వారికి సహకరించేవారు పోలీస్ విధులకు ఆటంకాలు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నరహరి తెలిపారు. చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడు బాధ్యతగా ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను అడ్డుకోవడం బెదిరించడం లేదా చట్టపరమైన చర్యలకు భంగం కలిగించడం నేరమని ప్రజలు గుర్తించాలని ఎవరైనా పోలీస్ విధులకు ఆటగా కలిగించే ప్రయత్నం చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి సిఐ నరహరి అన్నారు.




పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

## ప్రమాదకరంగా పెద్దేముల్ పెద్దచెరువు కట్ట

**...ఇరిగేషన్ అధికారులు స్పందించాలి**
**... సర్పంచ్ డివై నర్సిములు**

**పెద్దేముల్, మే 12, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్ట పరిస్థితి రోజురోజుకు ప్రమాదకరంగా మారుతోంది. గతంలో ఒకసారి ఈ చెరువు కట్టకు గండి పడటంతో దిగువన ఉన్న పంటపొలాలు ఉధృతమైన వరదలకు కొట్టుకుపోయి రైతులకు అపార నష్టం వాటిల్లింది. ప్రస్తుతం మళ్ళీ అదే ప్రదేశంలో కట్ట బలహీనపడి గండిపడే సంకేతాలు కనిపిస్తుండటంతో స్థానికులు,రైతులుఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామపంచాయతీ సర్పంచ్ డివై నర్సిములు, ఉపసర్పంచ్ డివైప్రసాద్‌తో కలిసి గ్రామస్థులు చెరువు కట్టను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కట్ట పరిస్థితిని గమనించిన అనంతరం సర్పంచ్ డివై నర్సిములు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైతే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన కట్టకు మరమ్మత్తులు చేపట్టాలని విన్నవించారు. పెద్దచెరువును పరిశీలించిన వారిలో రైతులు పురుషప్ప, రాంచెందర్, బ్యాగరి శ్రీనివాస్, లక్ష్మన్, వెంకటయ్య, నర్సిములు, నాయకులు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.



చెరువుకట్టకు గండిపడిన చోటును పరిశీలిస్తున్న దృశ్యం

## సేంద్రీయపద్ధతిలోనే వ్యవసాయం చేయండి!

**కొందుర్గు ,మే 12,ప్రభాతవార్త:** సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసినప్పుడే మంచి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు.ప్రజాపాలన ప్రగతినివేదిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు కొందుర్గులోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ మల్లయ్యలు రైతులతో నేరుగా మాట్లాడారు. సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేసి రసాయన ల అవశేషాలు లేకుండా నాణ్యమైన, సుస్థిరమైన దిగుబడి పొందాలని వారు సూచించారు. పత్తి తొలగించిన తర్వాత కట్టెను అలాగే దున్ని ఆరుతడి పంటలైన మొక్కజొన్న, మంచి నువ్వులను సాగు చేసుకుంటే గులాబీ రంగు పురుగు నివారణ అవుతుందన్నారు . వాన కాలంలో అచ్చరట ఫైర్ ను సాగు చేసి పూతదశలో కలియదునుకుంటే, భూమికి ఎంతో సత్వం వస్తుందని వారు వివరించారు. నీటిని దుర్వినియోగం కాకుండాచేసుకోకుండా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చౌడపురం ప్రభాకర్, వాడు సభ్యులు, మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి, ఏ. ఈ.ఓ.లు వెంకటేష్, వాసవి, లక్షీ శ్రీకాంత్, రమణ, అభ్యుదయ రైతులు తదితరులు



## ముడిసరుకుల ధరల పెరుగుదలపై నిర్మాణ కార్మికుల సమ్మె

**మే 16 నుంచి రెండు వారాల పాటు పనుల బంద్**

**జవహర్‌నగర్,మే 12,ప్రభాత వార్త:** నిర్మాణ రంగంలో ముడిసరుకుల ధరలు భారీగా పెరగడంతో కొత్త రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ భవన నిర్మాణ కాంట్రాక్టర్లు సమ్మె బాట పట్టారు. మే 16 నుంచి రెండు వారాల పాటు పనులు నిలిపివేస్తామని సంఘం నాయకులు ప్రకటించారు.భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొయ్యడ వెంకటేష్, బూడిద వెంకటేష్ మాట్లాడుతూ సిమెంట్, స్టీల్, ఇసుక, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో పాత రేట్లకు పనులు చేయడం సాధ్యం కాదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెల భారం వల్ల కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో క్వాలిటీ1 పనులకు చదరపు అడుగుకు రూ.2,600, క్వాలిటీ2కు రూ.2,300, కేవలం లేబర్ ఛార్జీ రూ.550గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## టిఎన్‌జివో జిల్లా శాఖ ఎన్నికకు రంగం సిద్ధం

**అభ్యర్థుల జాబితా ప్రకటించిన అధికారులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 12, ప్రభాత వార్త :** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్‌జీఓ) రంగారెడ్డి జిల్లా శాఖ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వివిధ పదవులకు దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం చెల్లుబాటు అయిన అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారులు మంగళవారం విడుదల చేశారు. జిల్లా ఉద్యోగ వర్గాల్లో ఈ ఎన్నికలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధ్యక్ష పదవికి రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ వి. యశ్వంత్ నామినేషన్ చెల్లుబాటైనట్లు అధికారులు ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్ష పదవికి సోషల్ వెల్ఫేర్ శాఖ హెచ్‌డబ్ల్యూఓ బి. మాధవ్ గౌడ్ బరిలో నిలిచారు. ఉపాధ్యక్ష పదవులకు వ్యవసాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ ఆర్. రంగయ్య, మెడికల్ శాఖ జూనియర్ అసిస్టెంట్ ఎం.డి. అంజత్ అలీ, రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్. గంగాధర్ నామినేషన్లు ఆమోదం పొందాయి. మహిళ ఉపాధ్యక్షురాలి పదవికి ప్లానింగ్ శాఖ ఎంపీఎస్ఓ టి. రాజశేఖర్ పేరు ఖరారైంది. ప్రధాన కార్యదర్శి పదవికి మెడికల్ శాఖ ఎంపీహెచ్ఎస్ ఎం. శ్రీనివాసరావు పోటీలో ఉండగా, సంయుక్త కార్యదర్శులుగా స్టేట్ ఆడిట్ శాఖ సీనియర్ ఆడిటర్ కె. శ్రీనివాస్, ప్లానింగ్ శాఖ ఎంపీఎస్ఓ ఎం.గాయత్రి, రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ బి.కార్తీక్ రెడ్డి,మెడికల్ శాఖ ఎంపీహెచ్ఎస్ జె.అమృత నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. కోశాధికారి పదవికి రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ సీనియర్ అసిస్టెంట్ బి. ఆనంద్ సింగ్ బరిలో ఉండగా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పంచాయతీరాజ్ శాఖకు చెందిన కె.శివకుమార్, ప్రచార కార్యదర్శిగా ట్రెజరీస్ శాఖ సీనియర్ అకౌంటెంట్ పి.మల్లేష్ గౌడ్ నామినేషన్లు ఆమోదం పొందాయి.కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ నసీరుద్దీన్, వెంకట్ రెడ్డి, పి. విజిత, కె. శేఖర్ నామినేషన్లు కూడా చెల్లుబాటైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. టీఎన్‌జీఓ జిల్లా శాఖ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగ సంఘాల్లో చురుకైన చర్చ సాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం తదుపరి ప్రక్రియ కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.





లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## పేదలకు అండగా ప్రభుత్వం

**కేశంపేట, మే 12, ప్రభాతవార్త :** నిరుపేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ శాసన సభ్యులు కేశంపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పేద ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు అవుతున్న ముఖ్యమంత్రి సహాయ నిధి సిఎంఆర్ఎఫ్ రాష్ట్రంలోని ఆపదలో ఉన్న పేద మరియు నిరుపేదప్రజలకు పెద్దఊరటగా నిలుస్తుందని తెలిపారు. వైద్య చికిత్సల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ నిధి ఎంతో మేలు చేస్తోందని, ప్రజల కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేశంపేట మండలానికి మంజూరైన రూ. 4,57,500 విలువైన సిఎం ఆర్ ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షులు అనుమగల్ల రమేష్ నేతృత్వంలో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, నిర్దవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్, బోదునంపల్లి సర్పంచ్ నగేష్, రావుల పెంటయ్య ముదిరాజ్, మంగలి శంకరయ్య , చాకలి నర్సింహా, కేశంపేట మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**మర్పల్లి, మే12,ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని కోటమర్పల్లి గ్రామంలోమల్లన్న గుట్టపై మల్లికార్జున స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి బుధవారం నాడు ఉదయం 9 గంటలకు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందనిఆలయ నిర్మాణ కర్త ఎం కృష్ణారెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమంకు వికారాబాద్ శాసన సభ్యులు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజర్ కానున్నారని ఆయన తెలిపారు. ఎంతో చరిత్ర గల మల్లకార్జున స్వామి పురాతన మందిరాన్ని తొలగించినూతన మందిర నిర్మాణం చేపట్టనున్నామని అందరి ఆశిస్సులతో మంచి సంకల్పంతో మందిర నిర్మాణం చేపట్టనున్నామన్నారు. మండలంలోని భక్తులు, గ్రామ ప్రజలు నాయకులు ఈ కార్యక్రమంకు విచ్చేసితీర్థప్రసాధాలు స్వీకరించి కార్యక్రమంను విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాచన్న, గ్రామ పెద్దలు రఘుపతి రెడ్డి జైహింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడే కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**మర్పల్లి, మే12,ప్రభాతవార్త :** నేడు బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపిడిఓ కార్యాలయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం పస్రాద్‌కుమార్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మీ, శాధీముబారక్ చెక్కుల పంపిణీ జరుగుతుందని తహశీల్దార్ పురుషోత్తంఒ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల లబ్ధి దారులకు సంబంధిత సిబ్బంది సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## వేసవి కాలంలో కూలీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఒఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

**పెద్దేముల్, మే 12, ప్రభాతవార్త:** పెద్దేముల్ గ్రామపరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గ్రామసర్పంచ్ డివై.నర్సిములు ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లాలప్ప కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును, కూలీల హాజరు నమోదు విధానాన్ని వారుపరిశీలించారు. ఈ సందర్భం గా సర్పంచ్ డివై నర్సిములు మాట్లాడుతూ పనికి రాని వారికి హాజరు వేయకుండా, పనికి వచ్చిన వారికి మాత్రమే హాజరు వేయాలని సూచించారు. అనంతరం ఆశావర్కర్ల ద్వారా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కూలీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కార్యక్రమాలపై సర్పంచ్‌ల వర్క్‌షాప్

**పెద్దేముల్, మే 12, ప్రభాతవార్త:** ఈ నెల 13న నేడు (బుధవారం ) తాండూరు పట్టణంలోని ఎస్‌విఆర్ గార్డెన్‌లో పాఠశాల విద్యాకార్యక్రమాలపై నియోజకవర్గస్థాయి సర్పంచ్‌లకు నిర్వహించనున్న వర్క్‌షాప్‌కు సంబంధించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ ఎంఈఓలు ఇందు ప్రియ, ఎస్.మహిపాల్‌రెడ్డి, రాములు, నర్సింగ్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## భార్య ఆచూకి తెలపాలని ఫిర్యాదు

**జిల్లెడు చౌదరిగూడ, మే 12,(ప్రభాతవార్త):** తన భార్య ఆచూకి తెలుపాలని జిల్లెడు చౌదరిగూడ పోలీసులకు భర్త చింటు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎదిర గ్రామానికి చెందిన వద్దె మౌనిక సోమవారం షాద్‌నగర్ బ్యూటి పార్లలర్‌కు వెళ్లి బ్యూటిషన్ వర్క్ నేర్చుకునేందుకు వెల్తానని భర్తతో చెప్పి వెల్లింది. సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన భర్త షాద్‌నగర్ వెల్లి తన భార్యను బ్యూటిపార్లలర్‌లో వెతికాడు. అక్కడికి మౌనిక రాలేదని నిర్వాహకులు తెలిపారు. తన భార్య కనబడకుండా పోయిందని మౌనిక భర్త చింటు మంగళవారం పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వితలక్ష్మీ పట్నాయక్**

**వికారాబాద్, ప్రభాతవార్త :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వితలక్ష్మీ పట్నాయక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యా వారోత్సవాల్లో భాగంగా యోగా నిపుణుడి ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతినిత్యం, యోగా, వ్యాయామం, ఉదయపు నడకవంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. అలవాట్లు ఆహార శైలిలో సైతం మార్పు అవసరమని కళాశాల ప్రిన్సిపల్ పేర్కొన్నారు. బ్రిడ్జి కోర్సుల పట్ల అవగాహన, పీజీ కోర్సులకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ ఏ విధంగా తీసుకోవాలి అనే అంశాల పట్ల కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఉపాధ్యాయులు

# భక్తి పారవశ్యంతో స్వామివార్ల కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవంలో కూర్చున్న పలువురు దంపతులు





..శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామిల, ..శ్రీభవాని రామలింగేశ్వరస్వామిల కల్యాణోత్సవాలు

శ్రీస్వామి వార్ల కళ్యాణోత్సవంలో పాల్గొన్న అన్నదాత,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానించిన దృశ్యం



**శామీర్‌పేట, మే 12, ప్రభాతవార్త:** ఉద్దెమర్రిలోని అతి పురాతనమైన అక్కన్న,మాదన్నలు నిర్మించిన శ్రీవిష్ణు,శ్రీశివుని ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీభవాని రామలింగేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవ వేడుకలు కన్నుల పండుగగా అంగరంగ వైభవంగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి లో ఉన్న పురాతన ఆలయం శ్రీవిష్ణు,శ్రీశివాలయంలో శ్రీస్వామి వార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగ జరిగింది. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగ ఉదయం ఆలయంలో సుప్రభాతసేవతో ప్రత్యేక పూజలు ప్రారంభమైనాయి. వాయిద్య గోష్టి, నిత్యార్పణ, వీరాంజనేయ స్వామికి సింధూర అభిషేకం, ఎదుర్కోళ్లు వంటి కార్యక్రమాలను నిర్వా హకులు నిర్వహించారు. శ్రీస్వామివార్ల కల్యాణోత్సవాలను వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆటపాటలతో భక్తి భావంతో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణమహోత్సవాల్లో పలువురు పుణ్య దంపతులు కూర్చొని పూజలు చేశారు.

శ్రీస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ పాల్గొని శ్రీస్వామి వార్లను దర్శించుకుని కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలో కల్యాణోత్సవం సందర్భంగా నక్క ప్రభాకర్‌గౌడ్ అన్నదాతగ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆ తరువాత సాయంత్రం దివ్యరథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. ఆలయప్రాంగణంలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వారి ప్రదర్శనలతో అందరిని ఆకట్టుకున్నారు. శ్రీరామభజన బృందం, అయ్యప్ప సేవా సమితి ఆలపించిన భజన పాటలతో ఆలయం భక్తి పారవశ్యంతో మారుమోగింది.

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన శ్రీస్వామివార్ల కల్యాణోత్సవ వేడుకల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరి, మూడుచింతలపల్లి మున్సిపాల్టీ చైర్మన్ జాము రవి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి,మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, జిల్లాకార్యదర్శి విష్ణుగౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి సిహెచ్ మహేందర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు లతవెంకటేశ, లతవెంకట్‌రెడ్డి, లతభూపాల్, ఆలయ ధర్మకర్తలు బూడిద రవీందర్‌గౌడ్, సామల రాజిరెడ్డి, ఆకుల నాగేశ్, నాయకులు మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వైద్యనాథ్, భూమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ జయంతి ర్యాలీ నిర్వహించిన జ్ఞాన సరస్వతి కమిటీ సభ్యులు

## హనుమాన్ జయంతిన యువత బైక్ ర్యాలీ

**యాచారం,మే12, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకొని హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం సంకల్ప భవన్ పైన ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌చే సంకల్ప ధ్వజావిష్కరణ, భక్తాంజనే యునికి అభిషేకం, యువత బైక్ ర్యాలీ ద్వారా నందివనపర్తి క్షేత్ర పరిధిలోని చిన్న చిన్న గూడాల్లో,తండాల్లో, గుట్టల్లో వెలసిన గంటోని బావి, బొల్లి గుట్ట తాండా, వెంకోని బావి, కరిద్దొని బావి, అయ్యవారిగూడ ల్లోని హనుమాన్ విగ్రహాలను, దేవాలయాలను సందర్శించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. బైక్ ర్యాలీని గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్,ఉప సర్పంచ్ శ్రీశైలం జ్ఞానసరస్వతి సేవాసమితి సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు.పవమాన హోమం మరియు పూర్ణాహుతి, తమల పాకులతో ఆకుపూజ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, అఖండ హారతి, అన్న ప్రసాద వితరణ.రాత్రి 08:00 గం. నుండి హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో జ్ఞానసరస్వతి సేవాసమితి సభ్యులు రాఘవేంద్ర శర్మ, రామనాథం, సంగెం గణేష్, చిన్న జలంధర్ రెడ్డి, నిఖిల్, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయితీ పాలక వర్గం సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్ , ఉప సర్పంచ్ జెనిగె శ్రీశైలం, వార్డు సభ్యులు, ఆలయ యూత్ ఫోర్స్ సభ్యులు నాగరాజు, మహేందర్, లక్ష్మణ్, సాయి కుమార్, సురేష్, శ్రీనాథ్, శివ మాతృ మండలి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దేవరయాంజాల్‌లో ఘనంగా శ్రీహనుమాన్ జయంతి

### ..పచ్చటి తోరణాలతో,పండ్లతో భక్తులను ఆకట్టుకున్న ఆలయ అలంకరణలు
### ..జరిగిన అన్నదాన కార్యక్రమం

**శామీర్‌పేట, మే 12, ప్రభాతవార్త:** దేవరయాంజాల్‌లో శ్రీఅభయ ఆంజనేయస్వామి (హనుమాన్) జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయం పచ్చటి తోరణాలు, పండ్ల ఫలాలతో అలంకరణలు చేయటం భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం శామీర్‌పేట మండలం లోని దేవరయాంజాల్‌లోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీహనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి శ్రీఅభయ ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించటంతో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల కోసం అన్నదాతలు గ్రామ మాజీ సర్పంచు ఇ.శ్రీనివాస్ గోల్డ్, మన్నె పురుషోత్తంరెడ్డి, కౌడె వెంకటేశ, రంగప్పగారి బాలింగ్‌గౌడ్, కౌడె బాలకృష్ణ, బి.నాగేశ్‌గౌడ్, సముద్రాల సురేశ్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో శ్రీహనుమాన్ సేవా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచు శ్రీనివాస్‌గోల్డ్, మాజీ కౌన్సిలర్ పి.నర్సింగ్‌రావుగౌడ్, రామాలయ మాజీ చైర్మన్ పి.సుదాకర్‌రెడ్డి, టీచర్ నర్సింహ్మారెడ్డి, బిజెపి అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డి, మహేశ్, నాగరాజు, నర్సింగ్‌రావు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, శ్రీ హనుమాన్ యూత్ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.





ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నదానం

దేవరయాంజాల్‌లో శ్రీఅభయ ఆంజనేయస్వామి జయంతి సందర్భంగ పూజలు జరిగిన దృశ్యం,పాల్గొన్న మాజీ సర్పంచు ఇ.శ్రీనివాస్‌గోల్డ్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,భక్తుల దృశ్యం



హనుమాన్ జయంతి పూజల్లో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా,గ్రామస్తులు

## భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

### సుఖశాంతులతో ఉండాలి - సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా

**కొత్తూర్, మే 12 (ప్రభాత వార్త):** హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో భక్తి భావం వెల్లివిరిసింది. గ్రామ హనుమాన్ దేవాలయంలో గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించినట్లు సర్పంచ్ తెలిపారు.పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ పద్మారావు, మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్, వార్డ్ సభ్యులు గట్టు లక్ష్మి చంద్రయ్య, అరవింద్ గౌడ్, దేవేందర్, గ్రామస్తులు మల్లేష్, గుండు కుమార్, గుండు బాలయ్య, ఉప్పల రాజు, బాగారి పోచయ్య, మధుసూదన్ రెడ్డి, కుమార్ గౌడ్, కాంత రెడ్డి, బీజేపీ నాయకులు, గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హనుమాన్ నామస్మరణతో మారుమోగిన అన్నామ్స్ పల్లి

**కడ్తాల్, మే 12, (ప్రభాతవార్త):** కడ్తాల్ మండలంలోని అన్మాస్ పల్లి గ్రామంలో ఉన్న వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయంలో హనుమాన్ విగ్రహానికి ఆరాధనతో పాటు హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కొర్పోలు లీల లక్ష్మారెడ్డి, నిర్వాహకులు డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మురళీకృష్ణ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తూవస్తున్నారు.ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమాన్ భక్త బృందం చేత భక్తిశ్రద్ధలతో పారాయణాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీను నాయక్, నరసింహ గౌడ్, ఉప సర్పంచ్ మహేష్, ఆమనగల్ మున్సిపాలిటీ ఐదవ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ ఎనుముల రమేష్, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీ మ్మనరసింహారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, చెగురి వెంకటేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా, జగన్ గౌడ్, రాజు గౌడ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో హనుమాన్ జయంతి

**ఘట్‌కేసర్, మే 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రీఅంజనేయస్వామికి ఆకుపూజ, చందన అలంకరణ, అభిషేకాలు చేశారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని దండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో అంజనేయ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమజ్జయంతి సందర్భంగా అర్చకులు వరదరాజు స్వామి మంత్రోచ్చారణాల మధ్య ఉదయం 6 గంటలకు అంజనేయస్వామికి అష్టోత్తరశత కలశాలతో విశేష అభిషేకం, అర్చన, మంగళహారతి, 9 గంటలకు సుందరాకాండ పారా యణం, సాయంత్రం శ్రీశ్రీశ్రీ దండ్లగడ్డ ప్రసన్నవీరాంజ నేయస్వామికి పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ దీక్షాపరులు హనుమాన్ పూజల్లో పాల్గొని భక్తులకు సేవలు అందించారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ కొంతం రాంరెడ్డి, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనిత, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, కొమురవెల్లి సభ్యులు మెరుగు నరేశ్‌గౌడ్, కొంతం నర్సింహ్మారెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, కందకట్ల సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో కాషాయపు జెండాలు కట్టి జైహనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. బాలాజీనగర్ గీతామందిర్‌లో, ఎన్ఎఫ్‌సీనగర్ విశ్వేశ్వరగిరి క్షేత్రం, శ్రీకళ్యాణకోదండరామాలయం, శ్రీదాసాంజ నేయస్వామి, ఘణాపూర్ శ్రీసీతారామాంజనేయ స్వామి, ఎదులాబాద్ ఊరహనుమాన్, మర్రిపల్లిగూడ, కొండాపూర్, అంకుశాపూర్, అవుషాపూర్, మాదారం తదితర చోట్ల హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఘణాపూర్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు రాజేశ్వరశర్మ మంత్రోచ్చారణాల మధ్య స్వామికి అభిషేకం, ఆకుపూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్–మాజీ సర్పంచ్ వేముల మమత మహేశ్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొని ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు వేముల సంజీవగౌడ్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, బోనకుర్తి అర్జున్, మాజీ వార్డుసభ్యులు వేముల శ్రీనివాస్‌గౌడ్, మండలి కృష్ణగౌడ్, పైళ్ల లత తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు దేవాలయాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు, పులిహోర వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మండలదీక్ష కొనసాగిస్తున్న హనుమాన్ మాలధారులు పూజలు చేసి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి బయలుదేరారు.



శివారెడ్డిగూడ దండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## కడ్మూరులో ఘనంగా హనుమాన్ జయంతి



పూడూరు మండలం కడ్మూరు హనుమాన్ మందిరం ఆవరణలో భజనలు చేస్తున్న భక్తులు

**పూడూరు, మే 11, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకల కార్యక్రమాలను భక్తులు ఘనంగా నిర్వహించారు.హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలోని హనుమాన్ మందిరంలో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు.ఆలయం ఆవరణలో కడ్మూరు,మిట్టకంకల్ గ్రామాల భజన మండలీలు పాల్గొని రాకంచెర్ల శ్రీవెంకటదాసులవారి సంకీర్తనలను ఆలాపించారు.అనంతరం గ్రామంలోని వీధులగుండా జైశ్రీరాం,జై హనుమాన్ అనే నినాదాలతో శ్రీఆంజనేయ స్వామివారి శోభయాత్రను నిర్వహించారు.దీంతో గ్రామం అంతా శ్రీరామనామ,హనుమాన్‌నామాల స్మరణతో మార్మోగింది.కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకుల పాయసము,తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న బజరంగ్ దళ్ నాయకులు,భక్తులు,తదితరులు

## హనుమాన్ జయంతి సందర్భంగా అన్నప్రసాద వితరణ

**ఘట్‌కేసర్, మే 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ గీతామందిర్‌లో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గీతామందిర్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములు ప్రత్యేక పూజలు చేయగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద విరణ చేశారు. ప్రతి సంవత్సరం హనుమజ్జయంతికి ఇక్కడ పావని జంగయ్యయాదవ్ మాలధారులకు ఏర్పాట్లు చేసి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. ఆంజనేయస్వామి ఆశీస్సులతో అందరూ జీవితంలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ధైర్యసహాసాలు పొంది చేపట్టిన పనులు విజయవంతం చేసుకోవాలని జంగయ్యయాదవ్ ఆకాక్షించారు. పరిసర కాలనీల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి హనుమాన్‌స్వామిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గీతామందిర్‌లో అన్నప్రసాద వితరణ చేస్తున్న జంగయ్యయాదవ్

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**ఘట్‌కేసర్, మే 12, ప్రభాతవార్త:** పట్టాలు దాటుతున్న ఓవృద్ధుడిని రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన మధుజుల భీమాచారి (79) రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. దీంతో తీవ్ర రక్త గాయాలైన భీమాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. సికింద్రాబాద్ డిప్యూటి ఎస్ఎస్ నుంచి సమాచారం రావడంతో జిఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని వివరాలు సేకరించి శవాన్ని పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## ప్రత్యేక పూజలతో కళకళలాడిన హనుమాన్ దేవాలయం

**కొత్తూరు, మే 12, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని శివ మారుతి హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. బజరంగ్ దళ్ నాయకులు, వేద పండితులు నాగరాజ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు తమలపాకులతో ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, స్వామివారికి విశేష అభిషేకాలు, పంచకుండాత్మక హనుమత్ కవచ హవన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. అనంతరం సాయంత్రం నిర్వహించిన బరి శోభాయాత్ర భక్తులని ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి బిజెపి పార్టీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజు చారి, ఇందూరి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో బజరంగ్ దళ్ సభ్యులు శివకుమార్ చారి, శేఖర్ గౌడ్, నరేష్ చారి, మురళి గౌడ్, హర్ష, చందు, బండి సుమన్, శివ, సందీప్ సింగ్‌తో బాలకృష్ణ, సుమన్, రామకృష్ణ, చందు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

## యామినికి జ్యోతిభాపూలే ప్రతిభాపురస్కారం

**ఘట్‌కేసర్, మే 12, ప్రభాతవార్త:** పదవతరగతిలో ఘట్‌కేసర్ మండల టాపర్‌గా నిలిచిన చెక్క యామిని మహత్మా జ్యోతిబాపూలే ప్రతిభా పురస్కారం అందుకుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మండల స్థాయి ఎస్ఎస్‌సి టాపర్లకు, ప్రదానోపాధ్యాయులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన యామిని మండల స్థాయిలో అత్యధిక మార్కులు 576 మార్కులు సాధించింది. ఈసందర్భంగా బిసిటిఏ అసోసియేషన్ సభ్యులు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థిని యామినిని శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రం, జ్యోతిబాపూలే పురస్కారం అందజేసి సత్కరించారు. యామిని తల్లిదండ్రులను కూడా సన్మానించి అభినందించారు.




తల్లిదండ్రులతో సన్మానం పొందిన విద్యార్థిని యామిని

## హనుమాన్ విగ్రహా ఏర్పాటుకు భూమిపూజ



పంచముఖ హనుమాన్ విగ్రహం

**ఘట్‌కేసర్, మే 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీభ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి దేవాలయ ఆవరణలో మంగళవారం పంచముఖ శ్రీవీరహనుమాన్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. దేవాలయ యజ్ఞపూజ ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఇక్కడ 21 అడుగుల ఎత్తైన నల్లరాతితో చెక్కిన పంచముఖ శ్రీవీరహన్ విగ్రహ ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తూ దాతల సహకారంతో పనులు చేయిస్తున్నారు. మంగళవారం హనుమజ్జయంతి సందర్భంగా గౌరీశంకర్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, మాజీ వార్డుసభ్యులు ఎర్రోళ్ల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పుస్తె, మెట్టెలు, వస్త్రాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ కావేరి మచ్చేందర్‌రెడ్డి

## కార్మికురాలి కూతురుకు పుస్తె, మెట్టెల వితరణ

**ఘట్‌కేసర్, మే 12, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో పారిశుద్య కార్మికురాలి కూతురు వివాహానికి మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్‌రెడ్డి పుస్తె, మెట్టెలు, నూతన వస్త్రాలను అందజేశారు. అవుషాపూర్ గ్రామ పంచాయతీలో 20 సంవత్సరాల పాటు కార్మికుడిగా పనిచేసి మరణించిన తోట లక్ష్మినారాయణ, ఆయన భార్య పద్మ (ప్రస్తుత పారిశుద్య కార్మికురాలు)ల కూతురు దివ్య వివాహం సందర్భంగా వారికి ఇంటికి వెళ్లిన మాజీ సర్పంచ్ కావేరిరెడ్డి బంగారు పుస్తె (తాళిబొట్టు) వెండి కాలి మెట్టెలు, నూతన వస్త్రాలు (రూ.20 వేలు)లను పెళ్లి కానుకగా అందజేశారు. నాయకులు ఏనుగు మచ్చేందర్‌రెడ్డి, తోట మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



జడ్పీహెచ్ఎస్‌లో శిబిరం ప్రారంభిస్తున్న ఇంచార్జ్ ఎంఇఓ రాములు, హెచ్‌ఎం పాపిరెడ్డి

## విద్యార్థులకు వేసవి శిబిరం ప్రారంభం

ఘట్‌కేసర్, మే 12, ప్రబాతవార్త: ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిభిరం ప్రారంభమయ్యింది. పిఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థుల కోసం వేసవి సెలవుల్లో వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు శిభిరాన్ని ఇంచార్జ్ ఎంఇఓ రాములు, జిహెచ్‌ఎం కొమిరెడ్డి పాపిరెడ్డిలు ప్రారంభించారు. ఈనెల 25వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించే శిభిరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులకు పలు విషయాలపై శిక్షకులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆర్ట్, క్రాఫ్ట్, యోగా, కమ్యూనికేషన్ ఇంగ్లీష్, స్పీడ్ మ్యాథ్స్, క్రియేటివ్ అక్టివిటిస్, గేమ్స్- ఫన్, కంప్యూటర్ క్లాసెస్, సంగీతంలో శిక్షణ ఇస్తారని తెలిపారు.